నిలిచిన జల్ జీవన్

- పలు గ్రామాలకు అందని తాగునీరు
- ప్రజలకు తప్పని కష్టాలు



సంతకవిటి మండలం బొద్దూరులో తాగునీటి కోసం ఎదురుచూపు

రాజాం : ప్రతీ ఇంటికి కుళాయిని ఇప్పించే కార్యక్రమం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు పెద్ద ఎత్తున నిధులు కేంద్రం నుంచి తీసుకొచ్చి అన్ని గ్రామాల్లో కొత్తగా వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు వేయించింది. ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటికి తాగునీటిని అందించే బృహత్తర కార్యక్రమం నియోజకవర్గంలో చురుగ్గా జరిగింది. నియోజకవర్గం మొత్తంపై 70 శాతం మేర ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ పథకం ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా జలజీవన్ మిషన్ మిగిలిపోయింది. గత ప్రభుత్వం సమయంలో ఏర్పాటు చేసిన పథకమే తప్ప కొత్తగా ఈ పథకం అమలుకు నోచుకోలేదు.

నియోజకవర్గంలో ఇలా ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో అన్ని గ్రామాలకు ఇంటింట కుళాయి పథకం అమలు చేసే ప్రయత్నం చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయానికి 70 శాతం మేర పథకం పూర్తయింది. ప్రతీ గ్రామంలో రక్షిత పథకాలు నిర్మాణం ప్రారంభించారు. తొలి విడతలో 19 గ్రామాలకు, మలి విడతలో 22 గ్రామాలు కలిపి మొత్తం రూ.18.88 కోట్లు నిధులు తాగునీటి కుళాయిలు నిమిత్తం కేటాయించారు. రేగిడి మండలంలో 15 గ్రామాలకు తొలి విడతలో, రెండో విడతలో 50 గ్రామాలకు కలుపుకుని మొత్తం రూ.32.74 కోట్లు నిధులు కేటాయించారు. సంతకవిటిలో రెండు విడతల్లో 66 గ్రామాలకుగానూ రూ.23.25 కోట్లు మంజూరీ చేశారు. వంగర మండలంలో 35 గ్రామాలకు సంబంధించి రూ.14.41 కోట్లు నిధులు వెచ్చించారు. నియోజకవర్గం మొత్తంపై 205 గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకుగానూ మొత్తం రూ.89.18 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉండిపోయాయి. పనులు పూర్తికాకపోవడంతో పలు గ్రామాల్లో రక్షిత పథకం ట్యాంకులు పూర్తికాకపోగా, మరికొన్ని గ్రామాల్లో ఇంటి కుళాయిలు ద్వారా నీరు అందని పరిస్థితి నెలకొంది.



రాజాం మండలం లక్ష్మీపురంలో ట్యాంకు వరకే పరిమితమైన పథకం

క్లాస్ కార్యక్రమమే గత్యంతరం

ప్రస్తుతం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో క్లాస్ ప్రోగ్రాం ద్వారా తాగునీటి బోర్లకు మరమ్మతులు చేస్తున్నారు. వేసవి కావడంతో తాగునీటి ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. ఫలితంగా గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రతీ మండలానికి రూ.4 లక్షల మేర నిధులు కేటాయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. జలజీవన్ మిషన్ అమలు కాకపోవడం కారణంగానే గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. రక్షిత పథకాల ద్వారా ఉదయం, సాయంత్రం నీటిని అందించే ఏర్పాట్లు చేశాం. రక్షిత పథకాలు సక్రమంగా లేని చోట బోర్లు బాగు చేయించాం. ఎక్కడైనా చిన్న సమస్యలు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నాం.

– వి.జగన్మోహనరావు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఉపాధి బిల్లుల పెండింగ్ రూ.42 కోట్లు



మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

రామభద్రపురం: క్లస్టర్ పరిధిలో జనవరి 17వ తేదీ నుంచి పల్లె పండుగ మరియు ఉపాధి వేతనదారుల వేతనాలు మొత్తం రూ.42 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఉపాధి హామీ పథకం ఏపీడీ రమామణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రత్నం, ఏపీఓ త్రినాధరావుతో కలిసి బుధవారం ఆమె ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె పండుగ పనులకు సంబంధించి రూ.24 కోట్లు, ఉపాధిహామీ వేతనదారులకు అందాల్సిన వేతనాలకు సంబధించి రూ.18 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బిల్లులు ఎప్పుడు పడతాయన్నది తన పరిధిలో లేదన్నారు. పంచ ప్రాధాన్యతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. లేబర్ మొబలైజేషన్, ఫాం పాండ్స్, ఫిష్ పాండ్స్, అగ్రి ఎల్లైన్మెంట్ పనులు, పశువుల నీటి తొట్టెలు, లేబర్ ఏవరేజ్ వేజ్‌పై దృష్టి సారించామన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

బొబ్బిలి: ప్రతీ వ్యక్తి సేవాభావాన్ని అలవర్చుకోవాలని సీఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి మూడు రోజుల పాటు సరిపడ పెరుగును స్థానిక జర్నలిస్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులతో కలసి పాద చారులకు మజ్జిగను అందజేశారు. మజ్జిగ అందజేసేందుకు జర్నలిస్టులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రేగుల వలస వ్యాస్‌బాబు, పీఆర్‌ఓ హర్షవర్ధన్, ఇతర కార్యవర్గం చుక్క జగన్మోహనరావు పాల్గొన్నారు.

నేడు, రేపు రిలే నిరాహార దీక్షలు



కార్మికులతో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: మున్సిపల్ కార్యాలయం ఎదుట గురు, శుక్రవారాల్లో కార్మికులు చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు సీహెచ్ రామ్మూర్తినాయుడు, అధ్యక్ష కార్యదర్శులు పి.లక్ష్మి, కె.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మున్సిపాల్టీ ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగర పంచాయతీగా ఏర్పడిన రాజాం మున్సిపాల్టీగా మారిందే తప్ప కార్మికుల సంఖ్య పెరగలేదన్నారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నామని వెల్లడించారు. అప్పటికీ అధికారులు స్పందించకుంటే సమ్మె చేసేందుకు వెనుకాడబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురువులు, బాలరాజు, వైకుంఠరావు, గిరి, శ్రీనివాసరావు, గోపి, భాస్కరరావు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

రేగిడి : ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఈ నెల 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షల హాల్ టిక్కెట్లు నిమిత్తం హెచ్‌టీటీపీ:// ఏపీబీఆర్ఏజీసిఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ నందు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ జరుగుతుందని వెల్లడించారు.

పేకాట శిబిరంపై దాడి

రామభద్రపురం: మండల పరిధిలోని కాకర్లవలస గ్రామ శివారులో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 16 మంది పేకాటరాయుళ్లను అరెసస్టు చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వి.ప్రసాదరావు తెలిపిన వివరాలు.. కాకర్లవలసలో భారీగా పేకాట శిబిరం నిర్వహణ జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సిబ్బందితో కలిసి దాడి చేయగా 16 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. అలాగే వారి నుంచి రూ.1,72,900లు నగదు, 15 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్‌లు పట్టుబడగా స్వాధీనం చేసుకున్నారు. బైక్‌లు సీజ్ చేసి వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

సచివాలయం ప్రారంభం

బొబ్బిలి రూరల్: అలజంగి గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే బేబినాయన బుధవారం ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో రెండు సచివాలయాలకు నిర్మాణం చేపట్టగా గతంలో మొదటి సచివాలయం ప్రారంభం కాగా ప్రస్తుతం పౌర సేవలన్నీ అందులోనే నిర్వహిస్తున్నారు. రెండో సచివాలయం నిర్మాణం పూర్తి కాగా బుధవారం ప్రారంభించారు. ఎంపీడీఓ పి.రవికుమార్, పీఆర్ డీఈ పివివి.అప్పారావు, కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జి



వంగర మండల పరిధి సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామిని లక్ష్మీపేట ప్రత్యేక న్యాయస్థానం జడ్జి తిరుమలరావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు అనంతరం స్థల పురాణం తెలియజేసి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ శంకర్ ఉన్నారు.

– వంగర

విరిగిన పలకలతో రాకపోకలకు అవస్థలు



రామభద్రపురం మండలంలోని కొండకెంగువల గ్రామంలో మురుగునీటి కాలువతో పాటు డ్రైన్‌పై అమర్చిన సిమెంటు పలకలు పూర్తిగా శిథిలమయ్యాయి. సిమెంట్ పలకలు విరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి కాలువ కూడా పూర్తిగా శిథిలం కావడంతో పూడికలతో నిండి మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– రామభద్రపురం

శిశువుల సంరక్షణపై దృష్టి సారించాలి



పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

బొబ్బిలి రూరల్: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి శిశువుకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు వారి సంరక్షణపై పూర్తిగా దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ జాగాన విజయలక్ష్మి సూచించారు. మండలంలోని శివడవలస అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల కార్యకర్తలు, మహిళా పోలీసులు, తల్లులు పాల్గొన్నారు.

ప్రార్థనాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

బొబ్బిలి: వివిధ ప్రార్థనాలయాలైన మసీదులు, చర్చిలు, ఆలయాలు, గుళ్ల గోపురాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం దాతలను కూడా సంప్రదించనున్నట్టు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సున్నితమైన పలు అంశాల నేపథ్యంలో సీసీ కెమెరాల ద్వారా జరిగిన, జరగనున్న, అనుమానాస్పద వ్యక్తుల ఆరా, దర్యాప్తుల కోసం సీసీ కెమెరాలు కీలకంగా మారిన నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేయనున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు దర్యాప్తుకు సీసీ కెమెరాలు మంచి సహకారం అందిస్తాయన్నారు. అలాగే హిట్ అండ్ రన్ వంటి కేసుల్లోనూ కెమెరాలు కీలకం కానున్నట్టు చెప్పారు. ఇప్పటికే పలు పాఠశాలలు, ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పట్టణంలోని ఫ్లెటైవర్ వద్ద ప్రమాదాలు జరగకుండా డివైడర్లను ఏర్పాటు చేయడం లేదా కొద్దిపాటి నియంత్రికలను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే డీఎస్పీ భవ్యారెడ్డితో కలసి ఫ్లెటైవర్ వద్ద పరిశీలన చేసినట్టు చెప్పారు. సిబ్బంది కొరత ఉన్నా ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం అమలు చేయాలని ఆ సంఘం సభ్యులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, రమేష్ మాట్లాడుతూ ఎంఎంఎస్ యాప్‌లో సాంకేతిక కారణాలతో వేతనదారుల హాజరు నమోదు కాకపోవడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు 100 రోజుల పని దినాలు పూర్తి చేయలేకపోతున్నామని వాపోయారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతి కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మండల స్థాయిలో బదిలీలు చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో నాగభూషణరావు, సత్యనారాయణ, నరసింహప్పడు, ఎర్రన్నాయుడు, రమణమ్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెంచిన ధరలపై నిరసన



గొల్లలపేటలో నిరసన ర్యాలీ

రామభద్రపురం: పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సీపీఎం నాయకుడు బలస శ్రీనివాసరావు అన్నారు. పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ మండలంలోని గొల్లలపేటలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. దీంతో విద్యుత్ చార్జీలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ

తెర్లాం: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న వేతనదారులంతా కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకి రూ.300లు వేతనం గిట్టుబాటు అవుతుందని ఆ పథకం ఏపీఓ సుశీల తెలిపారు. తెర్లాంలోని జగ్గారావు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు హాజరైన వేతనదారులు, మస్తర్లలో నమోదు చేసిన వేతనదారుల సంఖ్య పరిశీలించారు. వేతనదారులు రెండు పూటలా పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కనీసం రోజుకీ రూ.300లు వేతనం వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేయాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు ఉపాధి క్షేత్ర సహాయకుడు శంకర్ ఉన్నారు.

శ్రీరామమూర్తి సేవలు మరువలేనివి



శ్రీరామమూర్తి విగ్రహం వద్ద నివాళులు

రేగిడి : మండలంలోని చిన్నపుర్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కురిటి శ్రీరామమూర్తి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ సర్పంచ్‌గా వెలకట్టలేని సేవలు అందించారని అన్నారు. వైఎస్సార్‌సీపీకి నమ్మిన బంటుగా వ్యవహరించారని కొనియాడారు. ఎంపీటీసీ కురిటి రామకోటి, పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

బాడంగి: పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఎస్.రామకృష్ణకు కార్మికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమకు వేతనాలు కూడా సరిగా చెల్లించడం లేదని పేర్కొన్నారు. దీంతో తమ పిల్లల చదువులు సక్రమంగా సాగక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 30 శాతం తమ వేతనాల కోసం వెచ్చించి బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు ఎ.సురేష్, పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘ ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: క్రైస్తవులు మృతి చెందిన తరువాత వారి మృతదేహాలను ఖననం చేసేందుకు శ్మశాన వాటికలు లేవని అందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తహసీల్దార్ ఎం.శ్రీనుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఇప్పటికైనా అధికారులు క్రైస్తవులకు ప్రత్యేక స్థలాన్ని కేలాయించాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన జె.విల్సన్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రామభద్రపురం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారి అన్నారు. అంగన్‌వాడీ పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని ఆయా క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు.

పరీక్షల పరిశీలన

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న సీబీఏ-3, ఎస్ఏ-2 పరీక్షలను ఎంఈఓ త్రినాధరావు బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని వెలగవలస హైస్కూల్‌తో పాటు, రంగప్పవలస ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం వండేలా ఉపాధ్యాయులు చూడాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని తెర్లాం, రంగప్పవలస గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బోనెల రూప, శనపతి రాంబాబు ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. తెర్లాంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్ బుధవారం పరిశీలించారు.

గర్భిణులకు పౌష్టికాహారం

రేగిడి : మండలంలోని రేగిడి పీహెచ్‌సీకి ఆరోగ్య తనిఖీలు నిమిత్తం వచ్చిన గర్భిణులకు బుధవారం గ్రామానికి చెందిన విశ్వసాయి మందిరం సత్యసాయి భక్తులు పౌష్టికాహారాన్ని అందించారు. ప్రతీ నెల మాదిరిగానే ఈ నెల కూడా ఈ పౌష్టికాహారాన్ని అందించామని భక్తులు తెలిపారు.

చురుగ్గా సీసీ డ్రైన్‌ల నిర్మాణం

రాజాం : పట్టణంలోని గాయత్రీ కాలనీలో ప్రధాన వీధుల్లో సీసీ డ్రైన్‌ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. రూ.7.80 లక్షల నిధులతో వారం రోజులు క్రితం ఈ పనులు ఏఈ వెంకట్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణాలు పూర్తి దశకు చేరుకున్నాయని ఏఈ వెల్లడించారు. బుధవారం శివారు వీధిలో పెండింగ్ డ్రైన్ నిర్మాణం చేపట్టారు.

చెరువులో మట్టి తవ్వకాలు ఆపండి

రాజాం : మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో సాగునీటి చెరువుల్లో మట్టి అక్రమంగా తవ్వుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రైతుల పంట పొలాలకు మట్టి వేస్తున్నామని చెప్పి పొక్లెయిన్, ట్రాక్టర్ల యజమానులు గ్రావెల్ తవ్వి అక్రమ వ్యాపారం చేస్తున్నారని వెల్లడించారు. గ్రామం నుంచి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ఈ అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిలువరించి, చెరువులను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

రేగిడి : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని చిన్నారుల తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. బుధవారం మండలంలో అంబఖండి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు కేంద్రాల ద్వారా ఇస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

న్యూ స్ట్రాటజీ పనులపై దృష్టి సారించండి

రాజాం : గ్రామాల్లో రైతులకు న్యూ స్ట్రాటజీ పనులు చేసేలా అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కువగా రైతులకు ఉపయోగపడే సాగునీటి కాలువలు, కందకాలు తవ్వడం, ఫాం పాండ్లు నిర్మించడం వంటి పనులపై దృష్టి పెట్టాలని, వేతనదారులు రెండు పూటలా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఏపీఓ సాయిరాం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

బాడంగి: హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. ఆయన కార్యదర్శులతో సమావేశమయ్యారు. శతశాతం ఇంటి పన్నుల వసూలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయతీ విస్తరణాధికారి సూర్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

వంగర: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించడంతోనే గుర్తింపు వస్తుందని వంగర పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్ జ్యోతి, కె.ఈశ్వరరావు అన్నారు. ఇటీవల పీహెచ్‌సీలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో అత్యధిక కంటి ఆపరేషన్లకు ప్రోత్సహించిన వీవీఆర్‌పేట ఆశా వర్కర్ ఆర్.సత్యవతిని బుధవారం ఘనంగా సత్కరించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన సత్యవతిని అభినందించారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వంగర: పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీదుర్గ అన్నారు. మండల పరిధి శివ్వాంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. రెండేళ్ల వయసు వరకు చిన్నారుల సంరక్షణ, పోషణ, పౌష్టికాహారం, పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సకు 30 మంది ఎంపిక



సంతకవిటి: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో సత్యసాయి మందిరం వద్ద జిల్లా అంధత్వ సంస్థ విజయనగరం వారి సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవా సమితి, శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 60 మంది రోగులు హాజరుకాగా డాక్టర్లు తనిఖీలు చేపట్టి 30 మందిని నేత్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

వంగర: ప్రకృతి వ్యవసాయం చేస్తే భూమికి మేలు కలుగుతుందని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండల పరిధి మరువాడలో ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుకు నవధాన్యాలు సాగు చేసి దమ్ములో కలియ దున్నడం వలన ఎరువులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. సర్పంచ్ గాడి కృష్ణవేణి, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తదితరులున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పంచాయితీల్లో మరమ్మతులకు గురైన చేతి బోర్లు బాగు చేశామని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాకాడవలస, దిబ్బగుడ్డివలస, నిమ్మలపాడు, కొయ్యికొండవలస తదితర గిరిజన గ్రామాల్లో సైతం ఇప్పటివరకు 36 బోర్లను యుద్ధ ప్రాతిపదికన క్లాస్ ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేయించామన్నారు. ఏఈ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో లీకులున్న పైపు లైన్లను సైతం మరమ్మత్తులు చేసి ప్రజలకు వినియోగంలోకి తెచ్చామని తెలిపారు.